

సత్యనారాయణపురం సెంటర్లో మాధవరావు గారిది ఓ పెద్ద హోటల్. ఉదయం లేవగానే కాఫీ, టిఫెన్ల హడావుడితో పెద్ద సందడి!

రుబ్బుపత్రంలాంటి మాధవరావుగారు క్యాష్ టేబిల్ ముందు కూర్చొని పొంగిన పూరీలా నవ్వుతూ, కష్టమర్లను పలకరిస్తూ క్యాష్ బాక్సుని గల గల ధ్వనులతో నింపుతున్నాడు.

"ఇదిగో సర్వరూ, అల్లం, మిర్చి బాగా వేసి వేడి వేడిగా ఓ పెసరట్టు పట్రా. అన్నట్టు చట్నీ కొంచెం ఎక్కువ వేసుకురా" ఫ్యానుక్రింద అప్పుడే ఖాళీ అయిన కుర్చీలో కూర్చుంటూ అరిచాడు ఆంజనేయులు.

"ఎస్సార్" అంటూ తిరిగి అదే ఆర్డర్‌ను వంట గదిలోకి సర్వ్ చేశాడు సర్వర్.

"సార్, ఒక్క రవ్వ ఫ్యాన్ ఆఫ్ చేస్తారా" సప్లయిర్ కేక! మళ్ళీ ఎవరో అట్టు ఆర్డరిచ్చారనుకుని స్విచ్ మీదకు చేయి పోనిచ్చారు మాధవరావుగారు.

"లైట్ కాఫీ! పాలు, పంచదార ఎక్కువుండాలి" అట్టు ఆరగించి తిరిగి అరిచారు ఆంజనేయులుగారు.

మరు క్షణంలోనే కాఫీ కప్పు, బిల్లు టేబుల్ మీదకు ప్రత్యక్షమయ్యాయి.

అరలీటరు పాలు త్రాగినట్టుగా అర కప్పు కాఫీని త్రాగి బిల్లు అందుకున్నారు ఆంజనేయులుగారు.

"నమస్కారం మాధవరావుగారూ" ఒక చెయ్యి టేబిల్ మీద బిల్లు పెడుతుంటే, మరో చెయ్యి జేబులో చిల్లర కోసం వెతుకుతోంది.

ఉన్నట్టుండి ఉలిక్కిపడ్డారు ఆంజనేయులుగారు

ముఖంలో ఏదో కంగారు!

తిన్నది అట్టు.... పెట్టింది అముదం ముఖం!

బిల్లు అందుకుంటూ ఆంజనేయులు గారివైపు కుతూహలంగా చూశారు మాధవరావుగారు.

"అహాఁ.... అదికాదు.... డబ్బులు వేరే చొక్కా జేబులో వుండిపోయాయి. హడావుడిగా వచ్చేశాను. ఇప్పుడే యింటికెళ్ళి పట్టుకొచ్చి యిస్తానులెండి" అన్నారు దీనంగా లాల్చీ జేబులోంచి బయటకొచ్చినకాళీచేతివైపుచూసుకుంటూ

నువ్విక పనికిరావని ఉద్యోగంలో నుంచి గవర్నమెంటు తరిమి వేసినా జీవితం తరిమెయ్యలేదు కదా! వృద్ధాప్యంలో కూడా తన కాళ్ళమీద తాను నిలబడి బ్రతుకుతున్న ఆంజనేయులు గారంటే అంతో యింతో "సింపథీ" వుంది మాధవరావుగారికి. అందుకే "ఫర్వాలేదు. రేపు యివ్వచ్చు లెండి" అన్నారు పరిస్థితి అర్థం చేసుకుని.

ఆ మాటకి రోస్టు మినపట్టులా వున్న ఆంజనేయులుగారి ముఖం రవ్వకేసరిలా మారిపోయింది.

మాధవరావుగారిక్కి తన మాధవరావు

గార్కి తన మాటమీద ఉన్న నమ్మకం, గౌరవం అన్నీ తలుచుకుని లోలోపల మురిసిపోయారు. "ఇదే మరో హోటల్ అయితే ఈపాటికి చొక్కా లేకుండా బయటకు వచ్చి వుండేవాణ్ణి" అనుకున్నారు మనసులో ఆంజనేయులుగారు.

అదేమాట పైకి చెప్పి మాధవరావు గారికి మనసల్లా వున్న అభిమానానికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

అలవాటు ప్రకారం మర్నాడు కూడా ఆంజనేయులుగారు హోటల్లో అడుగు పెట్టడం, ఆ రోజు బిల్లుతోపాటు పాత బాకీ కూడా చెల్లించటం జరిగింది. మాట నిలబడ్డ వ్యక్తిగా మాధవరావుగారికి మరింత దగ్గరయ్యాడు ఆంజనేయులు గారు.

అప్పట్నుంచి రెండురోజుల కొకసారైనా ఆంజనేయులుగారు డబ్బులున్న లాల్చీని యింట్లో మర్చిపోయి కాళీ జేబుల్లోంచి చేతులు బయటకు తీయటం. "ఫర్వాలేదు రేపివ్వండి" అంటూ మాధవరావుగారు చిరునవ్వు నవ్వడం సర్వసాధారణమైపోయింది.

ఆ పరిచయంతోనే మాధవరావుగారు తన పదేళ్ళ కుర్రాణ్ణి ఆంజనేయులుగారి దగ్గరికి ట్యూషన్‌కు కూడా పంపిస్తున్నారు.

ఓ రోజు మామూలుగా మళ్ళీ కాఫీ, టిఫెన్ పూర్తి చేసి బిల్లు అందించి లాల్చీ రెండు జేబుల్లో రెండు చేతులు పోనిచ్చారు ఆంజనేయులుగారు ఆ రెండు జేబుల్లోకి చేతులు పోనిచ్చిన తీరు పాత బాకీ మీద కూడా ఆశ పెంచింది. మాధవరావుగారికి.

కుతూహలంగా చూస్తున్న మాధవరావుగార్కి ఆంజనేయులుగారి ముఖంలో మళ్ళీ పాత కళే కన్పించింది.

చల్లారిపోయిన యిడ్లీలా ముఖం పెడుతూ "యిదిగో మాధవరావుగారూ, యీ లాల్చీ చూడండి, ఎంత మాసిపోయిందో! వారం రోజులయింది మిగతా రెండు జతలు లాండ్రీ వాడికిచ్చి కాకపోతే రాత్రే తెచ్చిచ్చాడనుకోండి. మా ఆవిడేమో ఈ లాల్చీ జేబులోని డబ్బులు ఆ లాల్చీ జేబులో పెట్టుంటుంది! నేనేమో, హోటల్‌కే కదాని పాత లాల్చీ వేసుకొచ్చేసా. మీరేం అనుకోనంటే, మొత్తం రేపిచ్చేస్తాను" అన్నారు. ఆంజనేయులుగారు జేబుల్లోంచి కాళీ చేతులు బయటకు తీస్తూ.

పెరిగిపోయిన పాత బాకీని శేమ వేసుకుంటూ ఏడుపులాంటి నవ్వొకటి నవ్వారు మాధవరావుగారు, "సర్లెండి" అంటూ.

అప్పటివరకు సినిమా చూస్తున్నట్టుగా నిలబడి వున్న మాధవరావుగారబ్బాయి ఆంజనేయులుగారు అటు వెళ్ళగానే ఉండబట్టలేక వాళ్ళ నాన్నగార్ని అడిగేశాడు.

"నాన్నా, మా స్టారుగారు అలా అబద్ధం ఆడతారెందుకు? నాకు బాగా తెలుసు. ఆయనకున్నది అదొక్కటే లాల్చీ!" ఆశ్చర్యంగా అన్నాడు.

బయట కిళ్ళీకొట్టుదగ్గర నిలబడి వక్కపలుకు నోట్లో వేసుకుంటున్న ఆంజనేయులుగారికి లీలగా వినిపించాయా మాటలు. ఆ క్షణంలో ఆయన ముఖం మాడిన మినపట్టులా తయారయింది